క్లుప్తంగా

ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి

మోతె : అసెంబ్లీ ఎన్నికల ఓటింగ్ నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కోదాడ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి సూర్యనారాయణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మోతె మండలంలో 48 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. మండల, నియోజకవర్గ స్థాయి అధికారులు ఎన్నికల సిబ్బందికి, ఓటర్లకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు.

జ్యోతిరావు పూలే ఆశయాలు సాధించాలి



జ్యోతిరావుపూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

కోదాడఅర్బన్ : సామాజిక వేత్త మహాత్మ జ్యోతిరావుపూలే ఆశయాలను నేటి యువత సాధించాలని పలువురు పట్టణ ప్రముఖులు పేర్కొన్నారు. మంగళవారం పూలే వర్ధంతిని పురస్కరించుకుని కోదాడని పెరిక హాస్టల్‌లో పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పట్టణ ప్రముఖులు బొలిశెట్టి కృష్ణయ్య, పత్తిపాక జనార్దన్, కట్టెబోయిన శ్రీనివాస్, బుడిగం కిరణ్, రామకృష్ణ, వేణు, శంకర్, గోపి, సురేష్ తదితరులు ఉన్నారు.

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య



మధుకర్‌రెడ్డి (ఫైల్)

హుజూర్‌నగర్ : ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఉరేసుకుని ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. హుజూర్‌నగర్ పట్టణానికి చెందిన మర్రి రవీందర్ రెడ్డికి ఇద్దరు కుమారులు ఉన్నారు. వారిలో చిన్న కుమారుడు మర్రి మధుకర్‌రెడ్డి (28) సీఏ పూర్తి చేసి హైదరాబాద్‌లో ప్రైవేట్ ఉద్యోగం చేసి ఏడాది క్రితం మానేశాడు. మరో ఉద్యోగ ప్రయత్నంలో ఉన్నాడు.సుమారు 25రోజుల క్రితం హైదరాబాద్ నుంచి హుజూర్‌నగర్ వచ్చాడు. తన తండ్రి వద్ద ఉండడం ఇష్టం లేక పట్టణంలోని స్నేహితుడు రెడ్డిచర్ల నిఖిల్‌తో కలిసి పాల్వాయి సరోజినీ ఇంట్లో అద్దెకు ఉంటున్నారు. రూంలో ఒక్కడే ఉంటూ ఆర్థిక ఇబ్బందులతో ఫ్యానుకు ఉరి వేసుకున్నాడు. మిత్రుడు గమనించగ అప్పటికే మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుడి తండ్రి రవీందర్ రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ హరికృష్ణ తెలిపారు.

ప్రజలకు మెరుగైన పాలన అందిస్తాం

- హుజూర్‌నగర్ కాంగ్రెస్ అభ్యర్థి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



హుజూర్‌నగర్‌లో కాంగ్రెస్ ర్యాలీలో ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు

హుజూర్‌నగర్‌రూరల్ : రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రానుందని, వచ్చిన వెంటనే 6 గ్యారంటీ పథకాలను అమలు చేసి ప్రజలకు మెరుగైన పాలన అందిస్తామని ఎమ్మెల్యే అభ్యర్థి, ఎంపీ నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. మంగళవారం హుజూర్‌నగర్ మండల పరిధిలోని అమరవరం, శ్రీనివాసపురం గ్రామాల్లో నిర్వహించిన ఇంటింటి ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గం గత నాలుగేళ్లలో భూకబ్జాలు, ల్యాండ్, సాండ్ మాఫియాలకు అడ్డాగా మారిందని, అలాంటి నాయకులను రాజకీయాల నుంచి తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. యువకులు, విద్యావంతులు ఆలోచించి హస్తం గుర్తుకు ఓటు వేసి, బీఆర్ఎస్ అవినీతి పాలనను అంతమొందించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ వల్లభనేని విజయలక్ష్మి, పీఏసీఎస్ వైస్‌చైర్మన్ ఉస్తేల శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్ ఉస్తేల గురవారెడ్డి, కర్నాటి వీరనాగిరెడ్డి, నర్సిరెడ్డి, ఎస్‌కె రజాక్, సైదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటుకు సహకరిస్తా

హుజూర్‌నగర్ : ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటుకు సహకరిస్తానని కాంగ్రెస్ అభ్యర్థి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. మంగళవారం హుజూర్‌నగర్‌లోని వాసవీ కన్యకాపరమేశ్వరి మందిరంలో ఆర్యవైశ్య ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పేద ఆర్యవైశ్యులకు ఇళ్ల స్థలాలు, ఇళ్లు మంజూరు చేయిస్తానని, వారి పిల్లల చదువుకు సహకరిస్తానని అన్నారు. తొలుత ఆయన వాసవీమాత చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు మాశెట్టి అనంతరాములు, నాయకులు బచ్చు రామారావు, ఓరుగంటి నరసింహారావు, రైస్ మిల్లర్లు పొలిశెట్టి లక్ష్మీనర్సింహారావు, గెల్లి అప్పారావు, గెల్లి రవి, గజ్జి ప్రభాకర్, గుండా రమేష్, దాసా నాగేశ్వరరావు, ఎస్.శ్రీనివాస్, వెంకటనారాయణ, శ్రీనివాసరావు, గాయత్రి భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.



హుజూర్‌నగర్ : ఉత్తమ్‌ను సన్మానిస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు



హుజూర్‌నగర్ : రామపురంలో ఎన్నికల ప్రచారంలో చిన్నారిని ఎత్తుకున్న ఉత్తమ్

కాంగ్రెస్‌లోకి అవిరేణికుంటతండా సర్పంచ్

మఠంపల్లి : మండలంలోని అవిరేణికుంటతండా గ్రామ సర్పంచ్ బానోతు విజయనాగేశ్వరరావు సోమవారం రాత్రి జరిగిన ప్రచార కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నుంచి ఎంపీ ఉత్తమ్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. అనంతరం బక్కమంతులగూడెం, త్రివేణినగర్‌లలో జరిగిన ప్రచారంలో కాంగ్రెస్‌లో చేరి న వారికి ఎంపీ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించా రు. నాయకులు మంజీనాయక్, జైపాల్‌రెడ్డి, రమేష్‌నా యుడు, ఎల్లారెడ్డి, గోవిందరెడ్డి, భాస్కర్‌రెడ్డి ఉన్నారు.

కాంగ్రెస్ ప్రచార ర్యాలీ

హుజూర్‌నగర్ : పట్టణ కేంద్రంలో ఉత్తమ్ నాయకులతో కలిసి రోడ్డుపై ఉన్న దుకాణదారులను కలిసి ఓట్లు అభ్యర్థించారు. నాయకులు తన్నీరు మల్లికార్జున్, దొంతగాని శ్రీనివాస్ గౌడ్, ఆదెర్ల శ్రీనివాసరెడ్డి, ఎల్లారెడ్డి, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

అభివృద్ధి చేశాను.. గెలిపించండి

- కోదాడ బీఆర్ఎస్ అభ్యర్థి బొల్లం మల్లయ్యయాదవ్



సమావేశంలో మాట్లాడుతున్న మల్లయ్యయాదవ్

కోదాడ : కోదాడ నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేశానని, నీతి, నిజాయితీతో రాజకీయాలు చేశానని, డబ్బు సంచులతో వచ్చే వారిని నమ్మవద్దని, తన పనితీరు చూసి ప్రజలు కారు గుర్తుపై ఓటు వేసి తనను గెలిపించాలని కోదాడ బీఆర్ఎస్ అభ్యర్థి బొల్లం మల్లయ్యయాదవ్ కోరారు. మంగళవారం కోదాడలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు డబ్బులు పెట్టి నాయకులను కొన్నారని, ఓటర్లకు డబ్బులు పంచుతున్నారని ఆరోపించారు. అవినీతి సొమ్ముతో ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చే వెయ్యి రూపాయలకు ఐదు సంవత్సరాల భవిష్యత్తును బలిపెట్టవద్దని ఆయన ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. చుట్టపు చూపుగా వచ్చే నేతలను నమ్మవద్దన్నారు. తాను గడపగడపకు సంక్షేమ పథకాలను చేరవేశానని, కాంగ్రెస్ నాయకులు మాత్రం కోదాడలో పేకాట క్లబ్‌లను ఏర్పాటు చేశారని అలాంటి వారిని నమ్మవద్దని ఆయన కోరారు. ఎల్లప్పుడూ అందుబాటులో ఉండే తనను గెలిపించాలని ఆయన కోరారు.

బీఆర్ఎస్ నాయకుల ఇంటింటి ప్రచారం

నడిగూడెం : అసెంబ్లీ ఎన్నికల్లో కోదాడ బీఆర్ఎస్ అభ్యర్థి బొల్లం మల్లయ్యయాదవ్‌ను రెండోసారి ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరుతూ మంగళవారం ఆ పార్టీ ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నియోజకవర్గాన్ని సుందరంగా తీర్చిదిద్దా

- హుజూర్‌నగర్ బీఆర్ఎస్ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి



నేరేడుచర్ల : ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ అభ్యర్థి సైదిరెడ్డి



గరిడేపల్లి : ఎన్నికల రోడ్‌షోకు హాజరైన ప్రజలు

గరిడేపల్లి : ప్రతినిత్యం ప్రజల మధ్య ఉండే సైదన్న కావాలో, ఢిల్లీలో ఉండే ఉత్తమ్ కావాలో ప్రజలు నిర్ణయించుకోవాల్సిన బాధ్యత నియోజకవర్గ ప్రజలదేనని హుజూర్‌నగర్ బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంతో పాటు కుత్బుషాపురం, అగ్రహారం, గడ్డిపల్లి గ్రామాల్లో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యేగా నిరంతరం ప్రజలలో ఉంటూ గ్రామాల్లో అభివృద్ధి పనులు చేస్తున్న తనకు అన్ని వర్గాల ప్రజలు మద్దతు పలకాలని కోరారు. నాయకుల పేర్లు కూడా గుర్తుపట్టలేని ఉత్తమ్‌ను చిత్తుగా ఓడించాలన్నారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో వంద మందిని పలకరించే మీ సైదన్నని మంచి మెజార్టీతో గెలిపించాలన్నారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాలను కోట్లాది రూపాయలతో అభివృద్ధి చేసి సుందరంగా తీర్చిదిద్దిన ఘనత తనదేనని చెప్పారు. ఈ సందర్భంగా గ్రామాల్లో నాయకులు, కార్యకర్తలు సైదిరెడ్డికి ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో అమరవీరుడు శ్రీకాంతాచారి తల్లి కాసోజు శంకరమ్మ, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కృష్ణనాయక్, నల్లపాటి వీరమ్మ, భాస్కర్, మేకల స్రవంతిశోభన్‌బాబు, మాశెట్టి శ్రీహరి, గంటా సుధాకర్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మరోసారి గెలిపిస్తే ఆదర్శ నియోజకవర్గం చేస్తా

నేరేడుచర్ల : హుజూర్‌నగర్ నియోజకవర్గంలో అభివృద్ధి అంటే ఏంటో తాను చేసి చూపించానని, మరోసారి గెలిపిస్తే ఆదర్శ నియోజకవర్గంగా అభివృద్ధి చేసి చూపిస్తానని బీఆర్ఎస్ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంతో పాటు దిర్శించర్ల, కందులవారిగూడెం, ఇంజంవారిగూడెంలో ఎన్నికల ప్రచారంలో భాగంగా నిర్వహించిన రోడ్‌షోలో ఆయన మాట్లాడారు. నేరేడుచర్ల మున్సిపాలిటీని కోట్ల రూపాయలతో అభివృద్ధి చేసినట్లు తెలిపారు. తాను గెలిచిన తరువాత నేరేడుచర్లకు మున్సిఫ్ కోర్టు, అగ్రవర్ణాల పేదలకు మైనార్టీ బాలుర పాఠశాలను ఏర్పాటు చేస్తానని అన్నారు. రోడ్డు విస్తరణ పనుల్లో వ్యాపారులకు నష్టం జరిగిన మాట వాస్తవమని, గృహాలు కోల్పోయిన వారికి నూతన ఇళ్లు నిర్మించేందుకు తన వంతు కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో పట్టణ, మండల పార్టీ అధ్యక్షులు సత్యనారాయణరెడ్డి, అరిబండి సురేష్‌బాబు, మున్సిపల్ చైర్మన్ చందమళ్ల జయబాబు, డీసీసీబీ డైరెక్టర్ దొండపాటి అప్పిరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ నాగండ్ల శ్రీధర్, వీరయ్య, చిత్తలూరి సైదులు, కౌన్సిలర్లు, నాయకులు, ప్రజా ప్రతినిధులు తదితరులు ఉన్నారు.

కోదాడలో కాంగ్రెస్ గెలుపు ఖాయం



మునగాల : ఆకుపాములలో ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ అభ్యర్థి పద్మావతి



కోదాడలో ప్రచారంలో భాగంగా బజ్జీలు వేస్తున్న పద్మావతిరెడ్డి

- కోదాడ కాంగ్రెస్ అభ్యర్థి పద్మావతి

మునగాల : కోదాడలో కాంగ్రెస్ పార్టీ గెలుపు ఖాయమని కోదాడ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఎన్.పద్మావతి ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం మండలంలోని ఆకుపాములలో ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలు పద్మావతికి ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేస్తామని హామీ ఇచ్చారు. కోదాడలో బీఆర్ఎస్ దుష్ట పాలనకు చరమగీతం పాడాలని కాంగ్రెస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. గ్రామాల్లో పోలింగ్ శాతం పెంచేందుకు నాయకులు, కార్యకర్తలు కృషిచేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వి.చందర్‌రావు, ఎంపీపీ ఎలక బిందు, కాంగ్రెస్ పార్టీ కోదాడ నియోజకవర్గ నాయకులు పందిరి నాగిరెడ్డి, ఎంఏ జబ్బార్, మండల సీనియర్ నాయకులు విలాసకవి రామరాజు, జిల్లా వెంకటేశ్వర్లు, లిక్కి రామరాజు, సుంకి జయచంద్రారెడ్డి, విలాసకవి రమేష్ రాజు, జిల్లేపల్లి గోపి, పోలంపల్లి వెంకటేశ్వర్లు, పోలంపల్లి సైదులు, తాళ్లపాక వెంకన్న, తాళ్లపాక మధు, దావీదు, పోలంపల్లి వీరెందర్ పాల్గొన్నారు.

50 వేల మెజార్టీతో గెలవబోతున్నాం

కోదాడ : పట్టణంలోని ప్రధాన రహదారిపై కాంగ్రెస్ అభ్యర్థి పద్మావతి మంగళవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా హోటల్ వద్ద బజ్జీలు వేసి కార్యకర్తలకు అందించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కోదాడలో కాంగ్రెస్ పార్టీ 50 వేల మెజార్టీతో గెలవబోతుందని, పార్టీ అధికారంలోకి రాగానే 6 గ్యారంటీ పథకాలు అమలు చేస్తామని చెప్పారు.

కాంగ్రెస్‌లో చేరికలు

కోదాడ బీఆర్ఎస్ లీగల్ సెల్ అధ్యక్ష, కార్యదర్శులు చింతకుంట్ల రామిరెడ్డి, బండి వీరభద్రరావులు ఆ పార్టీకి రాజీనామా చేసి మంగళవారం కోదాడ కాంగ్రెస్ అభ్యర్థి నలమాద పద్మావతి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. బీఆర్ఎస్ అభ్యర్థి బొల్లం మల్లయ్యయాదవ్ వైఖరికి నిరసనగా తాము రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో లక్ష్మీనారాయణరెడ్డి, కెఎల్ఎన్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పద్మావతిని గెలిపించాలని ప్రచారం

మునగాల : కోదాడ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పద్మావతి విజయాన్ని కాంక్షిస్తూ మంగళవారం మునగాలలో కాంగ్రెస్ పార్టీ మహిళా నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షురాలు ఎలక శ్రీలతారెడ్డి, ఎంపీటీసీ సభ్యురాళ్లు ఉప్పుల రజిత, కల్పన, పార్టీ మండల నాయకులు సునీత, కోటేశ్వరరావు ఉన్నారు.

బీఆర్ఎస్‌కే మైనార్టీల మద్దతు

గరిడేపల్లి : హుజూర్‌నగర్ బీఆర్ఎస్ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డికే మైనార్టీల మద్దతు ఉంటుందని బీఆర్ఎస్ జిల్లా మైనార్టీ నాయకులు మన్సూర్ అలీ అన్నారు. మంగళవారం ఆయన స్థానికంగా విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గ అభివృద్ధి ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డితోనే సాధ్యమని తెలిపారు. నియోజకవర్గంలో కబరస్తాన్‌లకు, ఈద్గాలు, షాదీఖానాలకు నిధులు మంజూరు చేసిన సైదిరెడ్డి మైనార్టీల మన్ననలు పొందారని అన్నారు. ఈ నెల 30న జరిగే ఎన్నికల్లో సైదిరెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు.

ఆర్మీ క్విజ్ ఫైనల్‌కు విద్యార్థుల ఎంపిక



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న లెఫ్టినెంట్ జనరల్ కరణ్‌బీర్ సింగ్

కోదాడరూరల్ : ఆర్మీ క్విజ్ ఫైనల్ పోటీలకు కోదాడ పట్టణ పరిధిలోని కొమరబండలో గల తేజ విద్యాలయ విద్యార్థులు ఎంపికై నట్లు ఆ పాఠశాల ప్రిన్సిపాల్ రమాదేవి మంగళవారం తెలిపారు. కార్గిల్ యుద్ధం జరిగి 25 సంవత్సరాలైన సందర్భంగా 'బాటిల్ ఆఫ్ మైండ్స్'పేరుతో భారత సైనిక దళం దేశవ్యాప్తంగా ఈ పోటీలు నిర్వహిస్తోంది. మంగళవారం చెన్నైలోని ఆఫీసర్స్ ట్రెనింగ్ అకాడమీలో వివిధ రాష్ట్రాల నుంచి సెమీ ఫైనల్స్ నిర్వహించారు. సౌత్ ఇండియా నుంచి 18 పాఠశాలలు ఈ సెమీ ఫైనల్స్‌లో పాల్గొనగా కోదాడ తేజ విద్యాలయ విద్యార్థి దేవరపల్లి సునంద్‌రెడ్డి, నోముల సృజన్‌గుప్త, రామినేని సహాన, గాయం రేఖశ్రీలు ఉత్తమ ప్రతిభ కనబరిచి డిసెంబర్ 3న ఢిల్లీలో జరిగే ఫైనల్ క్విజ్ పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. ఫైనల్స్‌కు ఎంపికైన విద్యార్థులకు సౌత్ ఇండియా లెఫ్టినెంట్ జనరల్ కరణ్‌బీర్ సింగ్ బ్రార్ బహుమతులు అందజేశారు.

విద్యుదాఘాతంతో హార్వెస్టర్ ఆపరేటర్ మృతి

కోదాడరూరల్ : విద్యుదాఘాతంతో హార్వెస్టర్ ఆపరేటర్ మృతిచెందాడు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పల్నాడు జిల్లా వినుకొండకు చెందిన కొండి హరికృష్ణ(17) హార్వెస్టర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. వరి కోసేందుకు సోమవారం రాత్రి కోదాడ మండలం దొరకుంట నుంచి కాపుగల్లు వైపు లారీపై హార్వేస్టర్‌ను తీసుకొస్తున్నాడు. ఈ క్రమంలో కాపుగల్లు శివారులో విద్యుత్ తీగలు కిందకు ఉన్నాయి. ఆ తీగలను వారి వద్ద కర్రలతో పైకి లేపుతుండగా ఓ తీగ వచ్చి హరికృష్ణపై పడటంతో విద్యుదాఘాతానికి గురై తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని చికిత్స నిమిత్తం కోదాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి తండ్రి అంకమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో కేఆర్ఆర్ విద్యార్థుల ప్రతిభ



గోల్డ్ మెడల్ సాధించిన విద్యార్థికి ప్రశంసాపత్రం అందజేస్తున్న ప్రిన్సిపాల్ నాగు

కోదాడఅర్బన్ : నల్లగొండలోని మహాత్మా గాంధీ యూనివర్సిటీలో ఇటీవల జరిగిన ఇంటర్ కాలేజీ యూనివర్సిటీ వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో కోదాడలోని కేఆర్ఆర్ కళాశాల బీఏ విద్యార్థి ఎస్.వేణుగోపాల్ 67 కేజీల విభాగంలో ప్రతిభ కనబరిచి గోల్డ్ మెడల్ (నేషనల్ ఫస్ట్ ప్రైజ్) అందుకున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ నాగు తెలిపారు. అదేవిధంగా 81 కేజీల విభాగంలో డి.మోక్షజ్ఞసాయి, 109 కేజీల విభాగంలో బి.రాజేష్, 61 కేజీల విభాగంలో కె.వీరేష్, 55 కేజీల విభాగంలో టి.కార్తీక్ బంగారు పతకాలు సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం తన కార్యాలయంలో వేణుగోపాల్‌ను అభినందించి, ప్రశంసాపత్రం అందజేశారు. కళాశాల ఇన్‌చార్జ్ పిడి ఎస్ రామారావు, పి.సైదులు, శ్రీలక్ష్మి, డాక్టర్ నిర్మల కుమారి, అధ్యాపకులు ఉన్నారు.

స్వాతంత్య్ర సమరయోధుడు మృతి



రాంనర్సింహారెడ్డి (ఫైల్)

నేరేడుచర్ల : నేరేడుచర్లకు చెందిన రాజకీయ కురవృద్ధుడు, స్వాతంత్య్ర సమరయోధుడు తాటికొండ రాంనర్సింహారెడ్డి (99) మంగళవారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. రాంనర్సింహారెడ్డి నేరేడుచర్ల గ్రామ సర్పంచ్‌గా పని చేశారు. తెలుగు దేశం ఏర్పడిన సమయంలో ఆ పార్టీలో చేరి రెండవ మహానాడులో శిక్షకుడిగా, దివంగత మాజీ సీఎం నందమూరి తారక రామారావుకు విధేయుడిగా ఉండి మహానాడును విజయవంతం చేశారు. మండలాలుగా ఏర్పడిన తరువాత మొదటిసారిగా ఎంపీపీగా ఎన్నికయ్యారు. తెలంగాణ సాయుధ పోరాటం ఉద్యమంలో ఉప్పునూతల పురుషోత్తంరెడ్డికి శిష్యుడిగా కూడా పని చేశారు. ఇల్లందు జైలులో మూడు నెలల పాటు జైలు జీవితం గడిపారు. స్వాతంత్య్ర ఉద్యమంలో భాగంగా ఆయనకు ప్రభుత్వం పెన్షన్ కూడా మంజూరు చేయగా, తాను స్వాతంత్య్రం కోసం పని చేశాను కానీ పింఛను కోసం కాదంటూ తిరస్కరించారు. ప్రజాప్రతినిధిగా పని చేసే సమయంలోనూ ఒక్క రూపాయి మాత్రమే జీతం తీసుకున్నారు. మాజీ మంత్రి కుందూరు జానారెడ్డికి అత్యంత ఆప్తమిత్రుడిగా ఉన్నారు. ఆ తరువాత రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి జగదీష్‌రెడ్డికి విధేయుడిగా ఉంటూ బీఆర్ఎస్ పార్టీలో పని చేస్తున్నారు. బీఆర్ఎస్‌లో ఆయన చేసిన సేవలను గుర్తించి పార్టీ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని కూడా ఇచ్చింది. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందారు. కాగా, రాంనర్సింహారెడ్డికి ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. చిన్న కుమారుడు తాటికొండ నర్సిరెడ్డి రంగారెడ్డి జిల్లా కోర్టులో సినియర్ జడ్జిగా పని చేస్తున్నాడు. ఈ ఏడాది మే 8న జడ్జి కుమార్తె ఐశ్వర్య అమెరికాలో ఓ నల్లజాతీయుడి కాల్పుల్లో మృతి చెందింది. రాంనర్సింహారెడ్డి మృతి పట్ల పలువురు రాజకీయ ప్రముఖులు, ప్రజాప్రతినిధులు సంతాపం వ్యక్తం చేసి నివాళులు అర్పించారు.

సమస్యాత్మక గ్రామాల్లో పోలీసుల కవాతు

నడిగూడెం : ఈ నెల 30న అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా మంగళవారం మండల కేంద్రంతో పాటు పలు సమస్యాత్మక గ్రామాల్లో కేంద్ర సాయుధ బలగాలు, పోలీసులు కవాతు నిర్వహించారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు ప్రజలు సహకరించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో మునగాల సీఐ పి.వీరరాఘవులు, స్థానిక ఎస్ఐ పి.ఏడుకొండలు, సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీ, బీఆర్ఎస్‌లను గద్దె దించాలి



మాట్లాడుతున్న అంబటి నాగయ్య

కోదాడఅర్బన్ : ప్రజావ్యతిరేక పాలన సాగిస్తున్న కేసీఆర్‌ను, ఫాసిస్టు స్వభావంతో విద్వేశాలను రెచ్చగొడుతున్న నరేంద్రమోదీ ప్రభుత్వాన్ని గద్దె దించాలని టీపీజేఏసీ రాష్ట్ర కోకన్వీనర్లు రవిశంకర్, అంబటి నాగయ్య అన్నారు. మంగళవారం కోదాడలోని ఎంఎస్ కళాశాలలో జరిగిన కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో ప్రజలకు జీవనోపాధి, యువతకు ఉద్యోగాలు, ఉచిత విద్య, వైద్యం వంటి పలు హామీల అమలులో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. ప్రలోభాలు పెట్టి ప్రజల గొంతును నొక్కేయడం వంటి నిరంకుశ విధానాలు అవలంబిస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ఎన్నికల్లో ప్రజలు ఓడించాలని పిలుపునిచ్చారు. సర్వమత సమ్మేళనంగా ఉన్న భారతదేశాన్ని బీజేపీ ప్రభుత్వం కుల, మతాల పేరుతో చిచ్చు పెడుతూ పూర్తిగా హిందూ దేశంగా మార్చేందుకు కుట్ర చేస్తుందన్నారు. తెలంగాణ పీపుల్స్ జాయింట్ యాక్షన్ కమిటీ సూర్యాపేట జిల్లా కన్వీనర్ ముత్తవరపు రామారావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో టీపీజేఏసీ నాయకులు రాయపూడి చిన్ని, కాంగ్రెస్ నాయకులు పందిరి నాగిరెడ్డి, సీపీఎం నాయకుడు ముత్యాలు, ఎంఎల్ ఎన్‌డీ నాయకుడు ఉదయగిరి, జి.కోటయ్య, గంధం బంగారు, బంగారు నాగమణి, రాఘవరెడ్డి, నర్సింహారావు, రంగారావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


ఓటు హక్కుపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న అధికారులు, క్లబ్ సభ్యులు

నేరేడుచర్ల : పట్టణంలో మంగళవారం నేరేడుచర్ల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఓటు హక్కు వినియోగంపై నేరేడుచర్ల ఎస్ఐ పచ్చిపాల పరమేష్, మండల డిప్యూటీ తహసీల్దార్ స్రవంతి, క్లబ్ అధ్యక్షుడు చల్లా ప్రభాకర్‌రెడ్డి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ నిజాయితీగా ఓటు వేయాలన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ చైర్మన్ బట్టు మధు, వైస్ ప్రెసిడెంట్ సూర్యనారాయణరెడ్డి, కె.శ్రీనివాస్‌రెడ్డి, రంగారెడ్డి, విశ్వనాథం, సైదులు, ఉపాధ్యాయులు వెంకటేశ్వర్‌రావు, రవి, కృష్ణప్రసాద్, శ్రీనివాస్ ఉన్నారు.

ఎమ్మెల్యే పోకడలు నచ్చకనే పార్టీ మారాం



హుజూర్‌నగర్ : మాట్లాడుతున్న నాయకులు


హుజూర్‌నగర్ : ఎమ్మెల్యే సైదిరెడ్డి పోకడలు నచ్చకనే బీఆర్ఎస్ పార్టీని వీడామని ఇటీవల కాంగ్రెస్ పార్టీలో చేరిన నాయకులు తెలిపారు. మంగళవారం ఎంపీ క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. సైదిరెడ్డి నియోజకవర్గంలో దళితులను చిన్నచూపుచూస్తున్నాడని ఆరోపించారు. వీటిపై తాము చాలా సార్లు వ్యతిరేకించిన ఆయన తన వైఖరి మార్చుకోలేదన్నారు. చేసేది ఏం లేక కొంతకాలం మౌనంగా ఉండి బీఆర్ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరామని తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధి ఎంపీ ఉత్తమ్ కుమార్‌రెడ్డితోనే సాధ్యమన్నారు. ఈ సమావేశంలో పార్టీ మారిన నేతలు జిన్నారెడ్డి శ్రీనివాసరెడ్డి, ఎన్‌డీసీఎంఎస్ మాజీ చైర్మన్ వెంకటేశ్వర్లు, మున్సిపల్ మాజీ చైర్మన్ శ్రీనివాస్ ఎంపీపీ శ్రీనివాస్, నేరేడుచర్ల జెడ్పీటీసీ నర్సయ్య, ఎంపీటీసీ ముడెం గోపిరెడ్డి, గెల్లి రవి, పెండెం శ్రీనివాస్, పిడమర్తి రాజు ఉన్నారు.

వైన్స్ ఏర్పాటు వివాదాస్పదం

కోదాడ : పట్టణ పరిధిలోని అయ్యప్ప దేవాలయం సమీపంలో ఏర్పాటు చేయబోతున్న వైన్స్ వ్యవహారం వివాదాస్పదంగా మారింది. అక్కడ వైన్స్ ఏర్పాటు చేయవద్దని దేవాలయానికి వచ్చే భక్తులు, సమీపంలోని వైద్యశాల నిర్వాహకులు, సమీప ప్రాంతాల ప్రజలు రెండు నెలల నుంచి అధికారులకు వినతిపత్రాలు ఇస్తూ వస్తున్నారు. కోదాడ ప్రాంతంలో ఎంతో పేరున్న అయ్యప్ప దేవాలయానికి నిత్యం వేల మంది భక్తులు వస్తుంటారని, వారికి ఇది తీవ్ర ఇబ్బందిగా మారిందని వారు అధికారులకు ఫిర్యాదు చేశారు. అంతేకాకుండా జంక్షన్‌లో ఈ వైద్యశాల ఉండడం వల్ల నిత్యం ట్రాఫిక్ ఇబ్బంది ఏర్పడే అవకాశం ఉన్నందున అక్కడ వైన్స్ ఏర్పాటు చేయవద్దని వారు ఎక్సైజ్, సివిల్ పోలీసులతో పాటు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేశారు. అయినప్పటికీ అక్కడ వైన్స్ ఏర్పాటుకు నిర్మాణాలు కొనసాగించడం పట్ల వారు నిరసన వ్యక్తం చేస్తున్నారు.

అనుమతి ఇవ్వలేదు : ఎక్సైజ్ పోలీసులు

కోదాడలోని అయ్యప్పస్వామి దేవాలయం సమీపంలో వైన్స్ ఏర్పాటుకు దరఖాస్తు చేసుకున్న మాట వాస్తవమే. కానీ ఇప్పటివరకు ఎవ్వరికి అనుమతి ఇవ్వలేదని ఎక్సైజ్ సీఐ తెలిపారు.


యువతకు ఉద్యోగాలు రావాలంటే.. జనసేన రావాలి..
SR. NO. | NAME OF CANDIDATE SYMBOL
1.
1.
3.
4.
5.
6.
7.
8. మేకల సతీష్ రెడ్డి Mekala Satheesh Reddy
9.
10.
11.
12.
13.
14. NOTA
కోదాడ నియోజకవర్గంలోని యువత కోసం మొదటి సంవత్సరంలోనే పదివేల ఉద్యోగాల కల్పన లేనిపక్షంలో 365వ రోజు నాడు రాజీనామా...
ఇంటర్మీడియట్ ఆపైన కోర్సులకు చదివే విద్యార్థులకు ఉచితంగా ల్యాప్‌టాప్
ఎగ్జామ్స్ టైంలో మూడు నెలల డేటా ఫ్రీ 100 GB
నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు, కాలేజీలలో అధునాతన టాయిలెట్స్ నిర్మాణం.
జనసేన, భారతీయ జనతా పార్టీల ఉమ్మడి
కోదాడ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి
మేకల సతీష్ రెడ్డి గారి
గాజు గ్లాస్ గుర్తుకే
మీ అమూల్యమైన ఓటు వేసి
గెలిపించగలరని ప్రార్థన